క్లుప్తంగా

స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న సీఈఓ సత్యనారాయణ

సారవకోట: డీసీసీబీ బ్రాంచ్‌లకు సొంత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఈఓ దత్తి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సారవకోట డీసీసీబీ బ్రాంచ్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ జిల్లాలో 9 బ్రాంచ్‌లకు సొంత భవనాలున్నాయన్నారు. సారవకోట బ్రాంచ్‌ను పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహిస్తున్నామన్నారు. మిగిలిన బ్రాంచ్‌లకు సొంత భవనాలు నిర్మించేందుకు స్థలాలను పరిశీలిస్తున్నామని, 5 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉంటే భవన నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు.

కూచిపూడి నృత్య ప్రదర్శనకు ప్రశంస



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న చిన్నారులు

ఆమదాలవలస: తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి క్షేత్రంలో ఆమదాలవలస పట్టణానికి చెందిన నాట్యశ్రీ నృత్య కళానికేత్ విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకల్లో భాగంగా అక్కడి ప్రభుత్వం నిర్వహించిన ధార్మిక కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని నృత్య ప్రదర్శన చేసినట్లు శిక్షకురాలు కూన శ్రీలత మంగళవారం తెలిపారు. నిర్వాహకులు చిన్నారులకు ప్రశంసాపత్రాతో సత్కరించారు.

పాతపట్నం ఏఓగా రవికుమార్



పాతపట్నం: మండల వ్యవసాయశాఖ అధికారిగా కింజరాపు రవికుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఇక్కడ పనిచేసి, ఉన్నత చదువుల కోసం వెళ్లారు. మళ్లీ ఇక్కడ ఏఓగా విధుల్లో చేరారు. ఇక్కడ ఏఓగా పనిచేసిన బి.రవికుమార్ శ్రీకాకుళం మాతృ సంస్థకు తిరిగి వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన ఏఓకు ఏఈఓలు భారతి, శారద, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.


ప్రొటోకాల్ ఉల్లంఘనపై సర్పంచ్ ఆవేదన



సర్పంచ్ ఈశ్వరరావు

మెళియాపుట్టి: మండలంలోని చీపురుపల్లి గ్రామంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా స్థానిక అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘించారని చీపురుపల్లి సర్పంచ్ యవ్వారి ఈశ్వరరావు ఆరోపించారు. అయినప్పటికీ కార్యక్రమం వద్దకు వెళ్లానని, కుర్చీ వేయకుండా అవమానపరచడం బాధాకరమన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు.

ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అధ్యక్షుడిగా రాము



పొందూరు: పొందూరు, జి.సిగడాం మండలాల ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అధ్యక్షుడిగా శీర రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పొందూరు మార్కెట్ యార్డులో నూతన కార్యవర్గాన్ని సంఘం ప్రతినిధులు డాక్టర్ సునీల్, సాకేటి నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా రేగిడి సంతోష్, కోశాధికారిగా వజ్రగడ సాయిని ఎన్నుకున్నారు.

రెల్లి కులస్తుల ఆందోళన

- రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని డిమాండ్



ర్యాలీ నిర్వహిస్తున్న రెల్లి కులస్తులు

హిరమండలం: రెల్లి కులస్తులకు రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ హిరమండలం మండల కేంద్రంలోని ఏబీ ప్రధాన రహదారిలో జై భీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన, ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రెల్లి కుల సామాజిక ప్రతినిధులు కె.రవికుమార్, లోకనాథరావు మాట్లాడారు. జిల్లాను యూనిట్‌గా చేసి ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని, రెల్లి కులస్తులకు రిజర్వేషన్ శాతాన్ని పెంచాలన్నారు. కులగణన తరువాత వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లతో రెల్లి కులస్తులకు అన్యాయం చేయవద్దన్నారు. భావితరాలకు ఈ ఫలాలు అందించాలంటే వర్గీకరణ విషయంలో తమకు న్యాయం జరగాలన్నారు. న్యాయ పోరాట సమితి సభ్యులు, సామాజికవర్గ సభ్యులు డి.మోహన్‌రావు, ఎస్.అసిరయ్య, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్‌ప్లాంట్లు..
మాయాజలం

- నిబంధనలు గాలికి..
- నీటినాణ్యత శూన్యం..
- పట్టించుకోని అధికారులు



ఆటో ద్వారా విక్రయిస్తున్న వాటర్ క్యాన్లు

సరుబుజ్జిలి: మినరల్ వాటర్‌ప్లాంట్లు రోజురోజుకూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కొద్దిపాటి పెట్టుబడితోనే కొంతమంది నీటి వ్యాపారం చేస్తున్నారు. పట్టించుకునేవారు లేకపోవడంతో వారికి వరంగా మారింది. ఈ ప్లాంట్ల ద్వారా విక్రయిస్తున్న నీటి నాణ్యతపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, ఆమదాలవలస మండలాల్లో దాదాపు 33 మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. వీటిలో అధిక శాతం ప్లాంట్లకు అనుమతులు లేకపోవడం గమనించదగ్గ విషయం.

తక్కువ పెట్టుబడితో..

ప్రధానంగా ఐఎస్ఐ సర్టిఫై ఉండాలి. రివర్స్ ఆస్మోసిస్(ఆర్వో)ప్లాంట్ పెట్టాలంటే సుమారు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. ఈ విధంగా చేయడం వలన అధిక భారం కావడంతో కేవలం రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టి ప్లాంట్లు నడుపుతున్నారనే ఆరోపణలున్నాయి.



సరుబుజ్జిలిలో మినరల్ వాటర్ ప్లాంట్

ఆమదాలవలస నియోజకవర్గంలో మినరల్ వాటర్ ప్లాంట్ల వివరాలు..	
మండలం	వాటర్ ప్లాంట్లు
సరుబుజ్జిలి	5
ఆమదాలవలస	14
బూర్జ	4
పొందూరు	10

నిబంధనలు ఇవి..

- మంచినీటి సరఫరాకు ఐఎస్ఐతోపాటు బీఎస్ఐ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా పొందాలి.
- ఇసుక, కార్బన్ ఫిల్టరైజేషన్ ప్లాంట్ ఉండాలి.
- ఆర్వో ప్లాంట్ ద్వారా నీటిలో బ్యాక్టీరియాను నిర్మూలించే వ్యవస్థ ఉండాలి
- యూవీ ట్రీట్‌మెంట్ జరిగిన తరువాత చనిపోయిన బ్యాక్టీరియాను తొలగించాలి.
- బయాలజికల్, బ్యాక్టీరియా పరీక్షలు జరపాలి. ప్యాకింగ్ కూడా పూర్తివివరాలతో ఉండాలి.
- నీటి ఫిల్టర్‌కు అవసరమైన ఆధునిక పరికరాలు ఉండాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి. రెండు ల్యాబ్‌లు ఏర్పాటు చేసి కెమిస్ట్, మైక్రో బయాలజిస్ట్ తప్పనిసరిగా ఉండాలి.
- ఇవేమీ ఆర్వో ప్లాంట్లలో కనిపించడంలేదు. నీటి నిల్వలు సక్రమంగా చేయడంలేదు. పరీక్షలు లేకుండా మినరల్ వాటర్ పేరుతో ప్రజలను మోసగిస్తున్న వ్యాపారులపై గట్టి నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

నాణ్యతాప్రమాణాలు ఇలా ఉండాలి..

- ప్రభుత్వ అనుమతితో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి.
- వాటర్ క్యాన్‌పై నీటిని శుద్ధి చేసిన తేదీ, బ్యాచ్ నంబర్ వేయాలి. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆ నీటిని బీఎస్ఐకు పంపాలి.
- ప్లాంట్‌లో 3 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకులు ఉండాలి.
- శుద్ధి చేసిన నీటిని నిల్వ చేసేందుకు 304 గ్రేడ్ స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యాంక్ ఉండాలి.
- నీటిలో పీహెచ్ శాతం పరీక్ష చేయాలి. 75 శాతం కంటే తగ్గితే కిడ్నీ సంబంధిత వ్యాధుల బారిపడే ప్రమాదముంది.

నిర్వహణ సరిగా లేదు



ఆర్వో ప్లాంట్ల నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. నాణ్యతలేని వాటర్ బాటిళ్లు, ప్యాకెట్లు అందించి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. ల్యాబ్‌లో సరైన నిపుణులు లేకుండా నీటిని తయారుచేసి విక్రయిస్తున్నారు.

– రావాడ రవికుమార్, యరగాం, సరుబుజ్జిలి మండలం

తనిఖీలు లేవు



వేసవి కాలం కావడంతో గ్రామాల్లో ప్రతి ఇంటికీ మినరల్ వాటర్ పేరుతో అమ్మకాలు చేస్తున్నారు. నీటి నాణ్యత విషయంలో పట్టించుకున్న వారే లేరు. నిబంధనలు పాటించకుండా మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. దుకాణాల్లో నెలలు తరబడి నిల్వ చేస్తున్న వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లు కూడా విక్రయిస్తున్నారు.

– పి.తవిటినాయుడు, మర్రిపాడు, సరుబుజ్జిలి మండలం

ఆరోగ్య సమస్యలు వస్తాయి..



మినరల్ వాటర్‌ను నిపుణుల ఆధ్వర్యంలో తయారు చేయాలి. నీటిని శుద్ధిచేసి, తదుపరి నాణ్యతను పరిశీలించాలి. నీటిలో బ్యాక్టీరియాను నిర్మూలించే వ్యవస్థ ప్లాంట్‌లో ఉండాలి. శుద్ధి ప్రక్రియ సక్రమంగా లేకపోతే అనేక రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.

– బి.జ్యోతిర్మయి, వైద్యాధికారి, పురుషోత్తపురం పీహెచ్‌సీ, సరుబుజ్జిలి

లచ్చమ్మ పేరంటాలకు ప్రత్యేక పూజలు



లచ్చమ్మ పేరంటాలను పూజిన్న చింతాడ రవికుమార్



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

బూర్జ: మండల కేంద్రంలో గల సాకలి లచ్చమ్మ పేరంటాలు 7వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లచ్చమ్మ తల్లిని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ దర్శించుకున్నారు. మండల ప్రజలతోపాటు చుట్టు పక్కల మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, రజక సంఘ ప్రతినిధులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్మికుల ర్యాలీ



నినాదాలు చేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కాంట్రాక్టు కార్మికులు, నాయకులు

ఆమదాలవలస: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని మున్సిపల్ కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల యూనియన్ నాయకుడు తాడి సంతోష్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పాలపోలమ్మ ఆలయం జంక్షన్ నుంచి వన్ వే జంక్షన్ (గాంధీ విగ్రహం) వరకు ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని నిరసిస్తూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. సంతోష్ మాట్లాడుతూ.. ఆప్కాస్‌ను రద్దు చేసి మున్సిపల్ కార్మికుల పొట్టకొట్టవద్దని ప్రభుత్వాన్ని కోరారు. తమ జీవితాలను ఏజెన్సీలకు అప్పగించవద్దన్నారు. గతంలో మాదిరిగా మస్టర్ పాయింట్‌ను ఆమదావలస ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వద్ద ఏర్పాటు చేయాలన్నారు. పనిముట్లు అందజేయాలని కోరారు. పురపాలక సంఘం పరిధి పెరుగుతుందని, పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో ఉన్న వారిపై పనిభారం పెరుగుతుందన్నారు. 2018లో తొమ్మిది మంది కార్మికులకు సంబంధించిన ఈపీఎఫ్‌ను అప్పట్లో ఉండే ఏజెన్సీ నిర్వాహకులు చెల్లించలేదని, ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. యూనియన్ నాయకులు ఎస్.రాజేష్, ఎ.శ్రీనివాస్, కె.తారక, తదితరులు పాల్గొన్నారు.


డీఈఓను సస్పెండ్ చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ ఐక్యవేదిక సంఘ నాయకులు

ఆమదాలవలస రూరల్: జిల్లాలో విద్యా వ్యవస్థను దిగజార్చేలా వ్యవహరించిన డీఈఓ తిరుమలచైతన్యను వెంటనే సస్పెండ్ చేయాలని ఉపాధ్యాయ ఐక్యవేదిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలకు సంబంధించి కుప్పిలి మోడల్ స్కూల్‌లో తనిఖీల పేరుతో అలజడి సృష్టించారని ఆరోపించారు. జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా కక్షపూరితంగా వ్యవహరించి కొంతమంది విద్యార్థులను డిబార్ చేశారన్నారు. ఉపాధ్యాయులను కూడా సస్పెండ్ చేయటం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని ఆరోపించారు. విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్నారు. ఉపాధ్యాయుల సస్పెన్స్‌ను రద్దు చేసి తక్షణమే విధుల్లోకి తీసుకోవాలన్నారు. డిబార్‌కు బలైన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎస్.వి.రమణ, బొడ్డేపల్లి రామకృష్ణ, టి.వి.టి.భాస్కరరావు, బి.గోపిచంద్, సి.హెచ్.వెంకటరమణమూర్తి, కింతలి చంద్రరావు, పేడాడ అన్నాజీ, బి.సూర్యనారాయణ, ఎం.శ్యామలరావు, బి.రమేష్, పైడి రాజు, వి.గోపికృష్ణ, పి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉత్కళ్ దివస్



కృష్ణచంద్ర గజపతి, నీలకంఠదాస్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పాతపట్నం: మండలంలోని దిగువ కంద్ర వీధిలో గల మండల పరిషత్ ఒడియా ప్రాథమిక పాఠశాలలో ఒడిశా ఉత్కళ్ దివస్‌ను హెచ్‌ఎం భీమ్‌సేన్ పండా ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కృష్ణచంద్ర గజపతి, మధుసూదన్, నీలకంఠ దాస్, గోపిబంధు దాస్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎంఈఓ సి.హెచ్.తిరుమలరావు మాట్లాడుతూ ఎందరో మహనుభావుల త్యాగ ఫలితంతోనే ఒడిశా రాష్ట్రం ఏర్పడిందన్నారు. జిల్లాలో 130 మందిని ఉత్కళ వలంటీర్లుగా నియమించామని, 1 నుంచి 10వ తరగతి వరకు ఒడియా విద్యార్థులకు ఉచితంగా విద్యాబోధన చేస్తున్నారన్నారు. విద్యార్థులకు రామరాజు ట్రస్ట్ ఆధ్వర్యంలో సాంస్కృతిక పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పి.రామరాజు, శిర్ల జోగారావు, విద్యా కమిటీ చైర్‌పర్సన్ కుంతీదేవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామ సభలు సజావుగా నిర్వహించాలి



ఎంపీడీఓ పావనికి వినతిపత్రం అందజేస్తున్న ఐక్యవేదిక సభ్యులు

సరుబుజ్జిలి: ఈ నెల 14వ తేదీ నుంచి పంచాయతీల్లో నిర్వహించనున్న గ్రామ సభలు సజావుగా జరిగేలా సత్వర చర్యలు తీసుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కన్వీనర్, కో కన్వీనర్ ధవళ సింహాచలం, తులగాపు ధనుంజయరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ ఎం.పావనికి వినతిపత్రం అందించారు. గతంలో జరిగిన గ్రామ సభల్లో పలు లోపాలు తలెత్తాయని గుర్తు చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని గ్రామ సభలకు పూర్తిస్థాయిలో అధికారులు హాజరై, సమస్యలు సత్వరం పరిష్కరమయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు.

3,624 కుటుంబాలకు ఉపాధి కల్పన

సారవకోట: ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25లో 3624 మంది వేతనదారులకు 100 రోజులు పని కల్పించినట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. 100 రోజుల పని కల్పనలో, వేతన బడ్జెట్ వినియోగంలో జిల్లాలో సారవకోట మండలం ప్రథమ స్థానంలో నిల్చినట్లు తెలిపారు. వేతనదారులకు సరాసరి వేతనం రూ.248 పడిందన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రూ. 8.44 కోట్లు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఏపీఓ నారాయణరావు ఉన్నారు.

వంతెన ఏర్పాటు చేయాలని వినతి

సరుబుజ్జిలి: మండలంలోని పాలవలస సమీపంలో గల చింత బట్టి(కాలువ)పై వంతెన ఏర్పాటు చేయాలని అధికారులను ఆ గ్రామ రైతులు కోరారు. వంశధార అధికారులకు వినతిపత్రం అందజేస్తామని మంగళవారం వెల్లడించారు. యరగాం-పురుషోత్తపురం ఓపెన్ హెడ్ ఛానల్ నుంచి చింత బట్టికి సాగునీరు ప్రవహిస్తుంది. ఈ బట్టి ప్రవహించే సమయంలో రహదారి పక్కనే ఉన్న 8 అడుగుల మేర కందకాల్లో నీరు చేరుతుంది. కందకాల అవల ఉన్న సుమారు 400 ఎకరాల పంట పొలాలకు యంత్ర పరికరాలు, కూలీలను తరలించలేక 3 కిలో మీటర్ల మేర ప్రయాణించాల్సి వస్తుందన్నారు. వంశధార అధికారులు స్పందించి వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వంతెన ఏర్పాటు చేయాల్సిన ప్రాంతమిదే..

గ్రామ దేవతలకు చల్లదనం



వర్షాలు బాగా కురిసి పాడి పంటలు సంవృద్ధిగా పండాలని రాయిపోలమ్మ, పాతపట్నం అమ్మవారికి మెళియాపుట్టి మండలంలోని పట్టుపురం గ్రామస్తులు చల్లదనం చేశారు. మంగళవారం గ్రామస్తులు అంతా కలిసి ముర్రాటలతో బయలుదేరారు. చల్లగా దీవించాలని గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించారు. ప్రతీ ఏడాది పూజలు నిర్వహిస్తున్నటు తెలిపారు. - మెళియాపుట్టి

బోరు బాగు చేయరూ..



పాతపట్నం మండలంలోని కాగువాడ గ్రామంలో గల సోమప్ప కాలనీ (చంద్రయ్య కాలనీ)లో ఉన్న తాగునీటి బోరు 15 రోజుల క్రితం పాడైంది. వేసవి కాలం కావడంతో తాగునీటి కోసం కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. బోరును బాగుచేసి, పరిసరాలను పరిశుభ్రం చేయాలని కోరుతున్నారు. - పాతపట్నం

శిథిలావస్థ..



బూర్జ మండలంలోని నీలాదేవిపురం (నీలంపేట)లో 40 ఏళ్ల కిందట నిర్మాణం చేపట్టిన పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం ఈ భవనం వినియోగంలో లేదు. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. ఈ భవనంలో గ్రామస్తులు పశువులు కడుతున్నారు. రైతులు పండించిన పంటలు, కలప నిల్వ చేస్తున్నారు. కార్యాలయం ఆవరణలో పెంట కుప్పలు వేస్తున్నారు. అధికారులు స్పందించి ఈ భవనాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - బూర్జ

బంగారు బాలలు



నేషనల్ ఆస్ట్రోనిమికల్ సైన్స్ ఒలింపియాడ్ (నాసా) జాతీయ స్థాయి పరీక్షల్లో పాతపట్నం అమరజ్యోతి పాఠశాలకు చెందిన 17 మంది విద్యార్థులు లెవల్-1లో బంగారు పతకాలు సాధించారని ఎంఈఓ-2 సి.హెచ్.తిరుమలరావు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు బంగారు పతకాలు, సర్టిఫికెట్లను ఎంఈఓ మంగళవారం అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.సోమేశ్వరరావు, ఇప్పిలి మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - పాతపట్నం

పింఛన్లు మంజూరు చేయాలి



సత్యవరంలో పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ ఆరంగి మురళి

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 50 ఏళ్లకు పైబడిన అర్హులందరికీ పింఛన్లు మంజూరుచేయాలని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. మండలంలోని సత్యవరంలో కిడ్నీ డయాలసిస్ రోగి సీతమ్మకు పింఛన్ మంజూరు కావడంతో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 50 ఏళ్ల పైబడినవారు పింఛన్లు కోసం ఆశగా ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం వెంటనే విధివిధానాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. గతేడాది డిసెంబర్ నుంచి పింఛన్ పొందుతున్న భర్త మరణిస్తే.. ఆ మరుసటి నెల నుంచే భార్యకు స్పౌజ్ కోటా కింద పింఛన్ ఇస్తున్నారన్నారు. గతేడాది జూన్ నుంచి నవంబర్ వరకు మరణించిన వారి స్థానంలో పింఛన్లు మంజూరు చేయలేదన్నారు. ఇటువంటివారు మండలంలో అనేక మంది ఉన్నారని, వారిందరికీ వెంటనే పింఛన్లు మంజూరు చేయాలన్నారు. వార్డు సభ్యుడు ఇప్పిలి నీలం, తదితరులు ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎల్.ఎన్.పేట: రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ తెలిపారు. మండలంలోని బొడ్డవలస గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రీసర్వే సందర్భంగా చోటుచేసుకున్న సమస్యల పరిష్కారానికి ఇంతకు ముందే గ్రామ సభలు నిర్వహించటం జరిగిందన్నారు. ఆ సదస్సుల్లో వచ్చిన సమస్యలను ఆన్‌లైన్‌లో పొందుపర్చి వాటిని పరిష్కరించామన్నారు. ఇంకా ఎమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆర్ఐ ఎస్.గవరయ్య, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.